సాక్షి

మెదక్

గురువారం । 13 । ఫిబ్రవరి । 2025



బతుకు భారం.. ఆమె ఆధారం

గంగిరెద్దుల మహిళలు కుటుంబ పోషణ కోసం బతుకు పోరాటం చేస్తున్నారు.

వివరాలు 8లో ▸



మారిన శైలి.. వ్యాధుల కొలిమి

మారిన ఆహారపు అలవాట్లు, శారీక శ్రమ లేకపోవడంతో వ్యాధుల బారిన పడుతున్నారు.

వివరాలు 8లో ▸



పామాయిల్ సాగుతో లాభాలు

పామాయిల్ సాగుతో మంచి లాభాలు వస్తాయని అధికారులు సూచించారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

వైద్య సేవలు మరింత మెరుగుపర్చాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శ్రీరామ్

హవేళిఘణాపూర్(మెదక్): ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు మరింత మెరుగుపర్చాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని డీఎంహెచ్‌ఓ శ్రీరామ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని సర్దన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా వంద రోజుల టీబీ ప్రోగ్రాం, 30 ఏళ్లు పైబడిన వారిలో రోగ నిర్ధారణ, గర్భిణులకు చికిత్స, దీర్ఘకాలిక రోగాలు.. భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. రాబోయే రోజుల్లో ఇలాగే సేవలందిస్తూ జిల్లాలోని పీహెచ్‌సీలకు ఆదర్శంగా నిలవాలని కొనియాడారు. అలాగే ఆస్పత్రికి వస్తున్న ఆస్పత్రి అభివృద్ధి నిధుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డాక్టర్ వినయ్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

అడవిలో అగ్ని ప్రమాదం



మంటలు ఆర్పుతున్న అటవీశాఖ సిబ్బంది

రామాయంపేట(మెదక్): మండలంలోని అక్కన్నపేట అటవీ ప్రాంతంలో బుధవారం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న రేంజ్ అటవీ అధికారి విద్యాసాగర్ తన సిబ్బందితో వెళ్లి మంటలను ఆర్పి వేయించారు. సకాలంలో మంటలు ఆర్పకపోతే అటవీ ప్రాంతానికి నష్టం వాటిల్లేదన్నారు. పలువురు బీడీలు, సిగరెట్లు తాగుతూ నిర్లక్ష్యంగా పారవేస్తుండడంతో తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు.

మీసేవ కేంద్రాల తనిఖీ



మీ సేవ కేంద్రంలో ఈడీఎం సందీప్ తనిఖీ

మెదక్ కలెక్టరేట్: మీసేవ కేంద్రాల నిర్వాహకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఈడీఎం సందీప్ సూచించారు. బుధవారం జిల్లాలోని పలు మీసేవ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలక్ట్రానిక్ సర్వీస్ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని మీసేవ కేంద్రాలను తనిఖీ చేసినట్లు చెప్పారు. కేంద్రాలు సమర్థవంతంగా పనిచేసేందుకు తగు సూచనలు చేసినట్లు తెలిపారు. ప్రజల నుంచి అదనపు చార్జీలు వసూలు చేయకుండా నిబంధనల ప్రకారం సేవలందించాలని సూచించారు. ఆయన వెంట కార్యాలయ సిబ్బంది శశికాంత్ పాల్గొన్నారు.

దుర్గమ్మకు పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు


పాపన్నపేట(మెదక్): ఏడుపాయల దుర్గమ్మకు బుధవారం సాయంత్రం పల్లకీ సేవ నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకొని యాగశాలలో అర్చకులు చండీయాగం చేశారు. సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఉత్సవ విగ్రహాన్ని పూలమాలలతో అలంకరించి పల్లకీలో ఊరేగించారు.

ఇద్దరి బైండోవర్

మనోహరాబాద్ (తూప్రాన్): అక్రమంగా మట్టి తరలిస్తున్న ఇద్దరిని బుధవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు. కూచారం గ్రామానికి చెందిన గోవర్ధన్‌రెడ్డితో పాటు అంజనేయులు పలుమార్లు మట్టిని అక్రమంగా తరలిస్తూ పట్టుబడగా.. కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. అయినా మానుకోకపోవడంతో బైండోవర్ చేసినట్లు వివరించారు.

ప్రీ ఫైనల్‌కు ఓఎంఆర్

‘పది’ విద్యార్థులకు ముందస్తు అవగాహన



పాపన్నపేట(మెదక్): పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షల్లో ఓఎంఆర్ షీట్ల విధానం పరిచయం చేసేందుకు విద్యాశాఖ సమాయత్తం అవుతుంది. వార్షిక పరీక్షలకు ముందు ఓఎంఆర్‌పై అవగాహన కల్పించేందుకు మొదటిసారి ఈ నిర్ణయం తీసుకుంది. సాధారణంగా పోటీ పరీక్షల్లో ఓఎంఆర్ (ఆప్టికల్ మార్క్ రికగ్నిషన్ షీట్)ను ఉపయోగిస్తారు. విద్యార్థికి సంబంధించిన వివరాలు ఇందులో ముద్రించి ఉంటాయి. పదో తరగతికి మొదటిసారిగా 2006లో వినియోగించారు. ఓఎంఆర్‌పై విద్యార్థులకు సరైన అవగాహన లేకపోవడంతో కొంతమంది తప్పులు చేస్తున్నారు. దీన్ని నివారించేందుకు ఈసారి అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. మార్చి 6 నుంచి ప్రీ ఫైనల్.. 21 నుంచి వార్షిక పరీక్షలు జరగనున్నాయి.

విధిగా వివరాలు నమోదు చేయాలి

పదో తరగతి పరీక్షలో ప్రతి విద్యార్థికి ఆన్సర్ షీట్‌తో పాటు ఓఎంఆర్ షీట్ ఇస్తారు. విద్యార్థికి సంబంధించిన వివరాలు అందులో ముద్రించి ఉంటాయి. వాటిని సరి చూసుకోవాలి. ఒక వేళ ఏవైనా తప్పులున్నా, అది తనది కాకపోయినా, ఇన్విజిలేటర్‌కు తెలియజేయాలి. ఒక వేళ తప్పులుంటే, అతను ఇచ్చే ఖాళీ ఓఎంఆర్‌పై వివరాలు రాయాల్సి ఉంటుంది. తనకు ఇచ్చిన మెయిన్ ఆన్సర్ షీట్ నంబర్‌ను విధిగా నమోదు చేయాలి. ఎన్ని అడిషనల్ ఆన్సర్ షీట్లు తీసుకున్నారో, వాటి సంఖ్య కూడా దానిలో రాయాలి. అయితే పదో తరగతి విద్యార్థులకు ఫార్మటివ్, సమ్మెటివ్ పరీక్షల్లో ఓఎంఆర్ షీట్లు ఇవ్వడం లేదు. ఫైనల్ పరీక్షలో మాత్రం ఇస్తున్నారు. దీంతో కొంత మంది విద్యార్థులు గందరగోళానికి గురై ఓఎంఆర్ నింపడంలో తప్పులు చేస్తున్నారు. అందుకే ఈసారి ప్రీ ఫైనల్‌కు ఓఎంఆర్ ఇవ్వాలని నిర్ణయించారు.

68 సెంటర్లు.. 10,387 విద్యార్థులు

ఈ ఏడాది పదో తరగతి వార్షిక పరీక్షల కోసం జిల్లాలో 68 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. మొత్తం 10,387 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. ఇందులో 3,479 మంది తెలుగు మీడియం, 6,856 మంది ఇంగ్లీష్, 52 మంది ఉర్దూ మీడియం విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

అవగాహన మంచిదే..



పదో తరగతి ఫైనల్ పరీక్షల వరకు మాకు ఓఎంఆర్ షీట్ అంటే ఏంటో తెలియదు. దీంతో కొంతమంది తప్పులు చేస్తున్నారు. ప్రీ ఫైనల్ పరీక్షలకు ఇవ్వడం వల్ల కొంత అవగాహన వస్తుంది. ఇది పదో తరగతి పరీక్షలకే కాకుండా, ఇతర పోటీ పరీక్షలకు సైతం ఉపయోగపడుతుంది.

– భాగ్యశ్రీ, పదో తరగతి, పాపన్నపేట

వేసవిలో అంతరాయం లేని విద్యుత్

కలెక్టర్ రాహుల్‌రాజ్



విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం రాత్రి విద్యుత్‌శాఖ రూరల్ జోన్ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి, జిల్లా ఎస్‌ఈ శంకర్ కలెక్టర్‌ను కలిసి వేసవి విద్యుత్ ప్రణాళికపై సుదీర్ఘంగా చర్చించారు. జిల్లాలో కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు, విద్యుత్ అంతరాయం లేకుండా రూపొందిస్తున్న సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై వివరించారు. అంతకుముందు జిల్లా విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో ఎస్‌ఈ, చీఫ్ ఇంజనీర్ జిల్లాలోని డీఈలు, ఏడీఈలు, ఏఈలతో సమావేశం నిర్వహించారు. మంగళవారం ఒకే రోజు 7.88 మిలియన్ యూనిట్లు (ఎంయూ) విద్యుత్ వినియోగం జరిగిన ప్పటికీ పూర్తిస్థాయిలో అందించామన్నారు. అదేవిధంగా జిల్లాలకు 90 ఎంయూ విద్యుత్‌ను సైతం సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. మెదక్ పట్టణంతో పాటు మండలంలోని బాలానగర్‌లో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు చీఫ్ ఇంజనీర్ బాలస్వామి తెలిపారు.

మహిళల భద్రతకే షీటీమ్స్



షీటీం బృందంతో అదనపు ఎస్పీ మహేందర్

అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ మున్సిపాలిటీ: మహిళలు మౌనం వీడి నిర్భయంగా ముందుకు రావాలని అదనపు ఎస్పీ మహేందర్ పిలుపునిచ్చారు. బుధవారం రాష్ట్ర ఉమెన్ సేఫ్టీవింగ్ ద్వారా నిర్వహించిన ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. షీటీం ఆధ్వర్యంలో 72 మంది ఈవ్ టీజర్స్‌కు ఆన్‌లైన్ కౌన్సిలింగ్ నిర్వహించినట్లు చెప్పారు. ఇందులో 13 మంది మైనర్లు, 59 మంది యుక్త వయసు వారు ఉన్నారని తెలిపారు. షీ టీమ్స్ ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందిస్తాయన్నారు. షీటీం ఫిర్యాదులు, క్యూఆర్ కోడ్ గురించి వివరించారు. అన్ని బస్టాండ్లు, సినిమా హాళ్లు, స్కూళ్లు, కళాశాలలు, కార్యాలయాలు, రద్దీ ప్రాంతాల్లో షీటీం నంబర్లు, క్యూఆర్ కోడ్‌లతో కూడిన పోస్టర్లు ఉంటాయని తెలిపారు. మహిళలు అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు కాల్ చేసి తక్షణ పోలీస్ సహాయం పొందాలని సూచించారు. అలాగే వాట్సాప్ నంబర్ 8712657963లో ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గంగాధర్, బాల నర్సింలు, కానిస్టేబుళ్లు ప్రమీల, విజయ్, గంగమణి, స్వరూప, విజయరాణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బీఆర్‌ఎస్ నేతలవి మొసలి కన్నీరు

డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

నర్సాపూర్: డంప్‌యార్డు ఏర్పాటును పెద్ద సమస్యగా చూపి బీఆర్‌ఎస్ పబ్బం గడుపుకోవాలని చూస్తుందని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ ఆరోపించారు. బుధవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రజలను కులాలు, మతాలు, ప్రాంతాలుగా విభజించే కుట్ర చేస్తూ మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. డంప్‌యార్డు సమస్యను మంత్రుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ.. మాజీ మంత్రి హరీశ్‌రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా రెడ్డి అబద్ధాలు చెప్పి ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని మండిపడ్డారు. ప్యారానగర్ డంప్ యార్డు, కులగణనపై వారికి మాట్లాడే హక్కు లేదన్నారు. బీఆర్‌ఎస్ హయాంలోనే డంప్‌యార్డు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. అనాడు సునీతారెడ్డి బీఆర్‌ఎస్‌లో ఉన్నారని, ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డిని కలిసి సమస్యను వివరించి డంప్‌యార్డును ఇతర ప్రాంతాలకు తరలించేందుకు తమ వంతుగా కృషి చేస్తామని చెప్పారు. సమావేశంలో నాయకులు మల్లేష్, శ్రీనివాస్‌గుప్తా, చిన్న ఆంజిగౌడ్, మహేష్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రవిగౌడ్, రషీద్, అజ్మత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.

ఎన్నికలకు సన్నద్ధం కావాలి

అదనపు కలెక్టర్ నగేష్



మెదక్ కలెక్టరేట్: సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, డీఎల్పీఓలకు మొదటి దశ శిక్షణ కార్యక్రమం నిర్వహించగా.. అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో 492 సర్పంచ్, 190 ఎంపీటీసీ, 21 జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నట్లు చెప్పారు. ఎన్నికల కోసం ముందస్తుగానే అన్నిరకాల ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా ముందుకుసాగాలని సూచించారు. నోటిఫికేషన్ జారీ చేసి మండల పరిషత్ కార్యాలయాల్లో నామినేషన్ల ప్రక్రియను చేపట్టాల్సి వస్తుందని తెలిపారు. తదుపరి అన్నిరకాల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. బ్యాలెట్ పేపర్‌ను అభ్యర్థుల పేర్లపై తెలుగు అక్షర మాల క్రమపద్ధతిలో ముద్రించాల్సి ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీపీఓ యాదయ్య, డీఆర్డీఓ పీడీ శ్రీనివాసరావు, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎంపీడీఓలు, ఎంపీఓలు, డీఎల్పీఓలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం చేస్తారా.. ఇంటికి పోతారా?

ఉపాధ్యాయులపై డీఈఓ సీరియస్



మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్

రేగోడ్(మెదక్): ఉద్యోగం చేయాలని ఉందా.. ఇంటికి పోతారా..? అంటూ డీఈఓ రాధాకిషన్ ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, ఎంఆర్‌సీ కార్యాలయాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా రేగోడ్‌లోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదన్నారు. సాకులు చెబుతూ తప్పించుకుంటున్నారని మండిపడ్డారు. పనిచేయని వారిని గుర్తించి చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఉన్నత పాఠశాల హెచ్‌ఎంపై ఫిర్యాదు వచ్చిందని, అందరికీ ఆదర్శంగా ఉండాల్సింది పోయి.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలాగని ప్రశ్నించారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని, ఇలాగైతే స్కూల్ ఉంచుదామా..? ఎత్తేద్దామా అని అడిగారు. సంగమేశ్వర తండాలో బడి మూతపడిందని గతంలో ‘సాక్షి’లో వచ్చిన పలు కథనాలపై డీఈఓ స్పందించారు. ఆ పాఠశాల ఉపాధ్యాయురాలు రెండేళ్లుగా డిప్యూటేషన్‌పై వెళ్లారని, రెండేళ్లు దాటితే వేతనం నిలిపివేస్తామని చెప్పారు. త్వరలోనే పాఠశాలను ప్రారంభిస్తామన్నారు. మోడల్ స్కూల్ వసతి గృహాన్ని సైతం వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించి బాలికలకు వసతి కల్పిస్తామని తెలిపారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు భోజనం వడ్డించారు.

కాంగ్రెస్‌కు ఓట్లడిగే హక్కులేదు



వెల్దుర్తి: సమావేశంలో మాట్లాడుతున్న మల్లేశ్‌గౌడ్

బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్

వెల్దుర్తి(తూప్రాన్)/రామాయంపేట(మెదక్): పథకాల పేరుతో కాలయాపన చేస్తున్న కాంగ్రెస్‌కు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లడిగే నైతిక హక్కు లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయం వద్ద బుధవారం నిర్వహించిన సమావేశానికి వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, ప్రచారంపై చర్చించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కొమురయ్యను, పట్టభద్రుల ఎమ్మెల్సీగా అంజిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేలా నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దాసు, జిల్లా నాయకుడు శ్రీనివాస్‌గౌడ్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే రామాయంపేట పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మల్లేశ్‌గౌడ్ పాల్గొని మాట్లాడారు. ప్రతి వంద మంది పట్టభద్రులకు ఒక ఇన్‌చార్జిని నియమించుకుంటే ప్రచారం సాఫీగా సాగుతుందని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, పార్టీ పట్టణ అధ్యక్షుడు అవినాశ్‌రెడ్డి, మండలశాఖ అధ్యక్షుడు నవీన్‌గౌడ్ పాల్గొన్నారు.

వైభవం.. బోనాల ఉత్సవం



కౌడిపల్లి గోకుల్ యాదవ సంఘం ఆధ్వర్యంలో మల్లన్న జాతర వైభవంగా సాగుతోంది. ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ఎల్లమ్మదేవికి బోనాలు తీశారు. మహిళలు పట్టు వస్త్రాలు ధరించి బోనం కుండలను అందంగా అలంకరించుకొని ర్యాలీగా అమ్మవారి ఆలయానికి వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

– కౌడిపల్లి(నర్సాపూర్)

మమ్మల్నే కొనసాగించండి

- పదవులు కాపాడుకునేందుకు డీసీసీబీ చైర్మన్ల ముమ్మర యత్నాలు
- అనధికారికంగా పాలకవర్గాల భేటీలు
- పీఏసీఎస్ చైర్మన్ల సంతకాలతో తీర్మానాలు
- మంత్రి తుమ్మలను కలిసిన 8 జిల్లాల డీసీసీబీల చైర్మన్లు
- ‘స్థానిక’ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయంపై ఉత్కంఠ



ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ కార్యాలయం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: రాష్ట్రంలో డీసీసీబీ (జిల్లా కేంద్ర సహకార బ్యాంకు)ల పాలకవర్గాల పదవీకాలం రెండో రోజుల్లో ముగియనుంది. దీంతో తమ పదవులను కాపాడుకునేందుకు ఆయా డీసీసీబీ చైర్మన్లు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసిన ఎనిమిది ఉమ్మడి జిల్లాల డీసీసీబీల చైర్మన్లు... తమ పదవీకాలాన్ని పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. తాజాగా బుధవారం పలు జిల్లాలో డీసీసీబీ పాలకవర్గాల ఆత్మీయ సమ్మేళనాలపేరుతో సమావేశాలు నిర్వహించాయి. తమ పదవీకాలాన్ని పొడిగించాలని ప్రభుత్వాన్ని కోరుతూ అనధికారిక తీర్మానాలు చేశాయి. ఈ తీర్మానాలపై ఆయా ఉమ్మడి జిల్లాల్లో ఉన్న అన్ని పీఏసీఎస్ (ప్రాథమిక సహకార సంఘాల) చైర్మన్లతో సంతకాల సేకరణ చేయడం ఆసక్తికరంగా మారింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో డీసీసీబీ పాలకవర్గం సర్వసభ్య సమావేశాలు నిర్వహించేందుకు వీలు లేదు. దీంతో అనధికారికంగా సమావేశాన్ని నిర్వహించి ఈ మేరకు తీర్మానాలు చేశారు. డీసీసీబీలతోపాటు, పీఏసీఎస్‌ల పాలకవర్గం పదవీకాలం ఈనెల 15తో ముగుస్తున్న విషయం విదితమే.

మేమంతా కాంగ్రెస్ వాళ్లమే...

ఉమ్మడి జిల్లాల వారీగా రాష్ట్రంలో మొత్తం తొమ్మిది (హైదరాబాద్ మినహా) డీసీసీబీలున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక డీసీసీబీల్లో జరిగిన ఆర్థిక అవకతవకలపై విచారణ చేపడతామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందిన ఈ తొమ్మిది డీసీసీబీ చైర్మన్లలో ఎనిమిది డీసీసీబీల చైర్మన్లు ఆ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన సంగతి తెలిసిందే. ఒక్క కరీంనగర్ డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు మాత్రమే ప్రస్తుతం బీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్నారు. బీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్న రవీందర్‌రావును కొన్ని నెలల క్రితం టెస్కాబ్ చైర్మన్ పదవి నుంచి అవిశ్వాస తీర్మానం పెట్టి తొలగించిన విషయం విదితమే. ప్రస్తుతం కాంగ్రెస్‌లో కొనసాగుతున్న ఈ ఎనిమిది డీసీసీబీ చైర్మన్లు తామంతా తమ పదవీకాలాన్ని పొడిగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళతానని మంత్రి తుమ్మల హామీ ఇచ్చినట్లు డీసీసీబీ చైర్మన్లు చెబుతున్నారు.

మమ్మల్ని కూడా కొనసాగించండి..

పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం)ల పాలకవర్గాల పదవీకాలం కూడా ఈనెల 15తోనే ముగుస్తుంది. దీంతో తమ పదవీకాలాన్ని కూడా కొనసాగించాలని ఆయా పీఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు కోరుతున్నారు. రాష్ట్రంలో మొత్తం 920 పీఏసీఎస్‌లు ఉండగా.. బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో తొంభై శాతం పీఏసీఎస్‌ల చైర్మన్లు బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వారే ఉన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో కాంగ్రెస్ కండువాలు కప్పుకున్న చైర్మన్ల సంఖ్య సుమారు 585 చేరినట్లు అనధికారిక అంచనా. దీంతో తాము కూడా కాంగ్రెస్ పార్టీతోనే ఉన్నామని తమ పదవీకాలాన్ని కూడా కొనసాగించాలని పీఏసీఎస్ చైర్మన్లు కోరుతున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో...

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. కొన్ని రోజుల్లోనే ఈ ఎన్నికల నోటిఫికేషన్లు విడుదలయ్యే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ఈ డీసీసీబీ, పీఏసీఎస్‌ల పాలకవర్గం పదవీకాలం విషయంలో ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉంటుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సర్పంచ్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పీఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లుగా ఉన్న నాయకులు కీలక పాత్ర పోషిస్తుంటారు. ఈ స్థానిక ఎన్నికల నేపథ్యంలో తమను కొనసాగిస్తే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుకోసం కృషి చేస్తామనే అభిప్రాయాన్ని పీఏసీఎస్‌ల చైర్మన్లు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వ నిర్ణయం త్వరలోనే రానుందని సహకార వర్గాలు పేర్కొంటున్నాయి.

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత



వాహనాన్ని పట్టుకున్న పోలీసులు

జహీరాబాద్: అక్రమంగా తరలిస్తున్న 115 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చిరాగ్‌పల్లి ఎస్‌ఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం రాష్ట్ర సరిహద్దులో గల మాడ్గి చెక్‌పోస్టు వద్ద సివిల్ సప్లయ్ అధికారులతో కలిసి వాహనాలను తనిఖీ చేస్తున్నామన్నారు. హైదరాబాద్ నుంచి మహారాష్ట్రకు అక్రమంగా డీసీఎం వాహనంలో రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. బియ్యం యజమానులు శివానంద, వెంకట రాథోడ్, పాండు, డీసీఎం యజమాని సిద్ధు, డ్రైవర్ సంగమేశ్‌లపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కానిస్టేబుల్

హత్నూర(సంగారెడ్డి): తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన హత్నూర మండలం తాహెర్ ఖాన్ పేటలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది.పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన చెల్కల మల్లేశం కుటుంబ సభ్యులతో కలిసి బ్యాతోల్లో జరుగుతున్న ఉత్సవాలకు వెళ్లాడు. మంగళవారం సాయంత్రం మల్లేశం ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడాన్ని స్థానికులు గుర్తించి వారికి సమాచారం ఇచ్చారు. బాధితులు వచ్చి చూడగా అల్మారాలో దాచి ఉంచిన వెండి కడియాలు, పది తులాల వెండి బిస్కెట్ బిళ్లలు, మెట్టెలు, రూ.23 వేల నగదు దొంగలు ఎత్తుకెళ్లిన గుర్తించారు. మంగళవారం సాయంత్రం హత్నూర పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. బుధవారం ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

అత్యాచారయత్నం కేసులో..

నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష

జహీరాబాద్: కోహీర్ మండలంలోని మనియార్‌పల్లి గ్రామానికి చెందిన బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన నిందితుడికి కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించినట్లు బుధవారం ఎస్పీ రూపేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన కథనం మేరకు.. 1 ఫిబ్రవరి 2021న గ్రామానికి చెందిన నివాసితులు వ్యవసాయ పనులకు బయటకు వెళ్లగా వారి కుమార్తె(17) ఇంట్లో ఉన్న విషయాన్ని మర్పల్లి మండలంలోని కోట్‌పల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులు గమనించాడు. ఇంటికెళ్లి బాలికపై అత్యాచారయత్నం చేయగా ఆమె గట్టిగా అరవడంతో పారిపోయాడు. ఎవరికైనా చెబితే ఫొటోలు సోషల్ మీడియాలో పెడుతానని భయభ్రాంతులకు గురి చేశాడు. ఈ విషయంపై బాధితురాలి తల్లి అప్పట్లో కోహీర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి విచారణ జరిపిన అనంతరం చార్జిషీట్ దాఖలు చేశాడు. కేసు పూర్వపరాలు పరిశీలించిన జడ్జి కె.జయంతి నిందితుడికి మూడేళ్ల జైలుశిక్షతోపాటు రూ.5వేలు జరిమానా విధించినట్లు ఎస్పీ పేర్కొన్నారు.

పరస్పర దాడిలో ఇద్దరిపై కేసు

మనోహరబాద్(తూప్రాన్): పరస్పర దాడి విషయంలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మంగళవారం రాత్రి కూచారం శివారులో మట్టిని అక్రమంగా తరలిస్తున్నట్లు వీఆర్‌ఏ రాజయ్యకు గ్రామస్తులు సమాచారం అందించారు. వీఆర్‌ఏ అనారోగ్యంతో ఉండటంతో అతడి కుమారుడు ఆనంద్‌ను ఘటనా స్థలానికి పంపించాడు. మట్టి తరలింపు విషయంలో గోవర్ధన్‌రెడ్డికి ఆనంద్‌కు మధ్య వాగ్వాదం జరిగి ఒకరిపై ఒకరు కర్రతో దాడి చేసుకున్నారు. ఇద్దరూ పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బతుకు భారం.. ఆమె ఆధారం

■ గంగిరెద్దుల వారి జనాభా 320 ■ స్థానిక కుటుంబాలు 95 ■ ఓటర్లు 210 ■ చిరు వస్తువులు అమ్మే మహిళలు 35

తెల్లవారక ముందే గంప నెత్తిన పెట్టుకొని గజగజ వణికించే చలి.. జోరున కురిసె వానను లెక్కచేయకుండా బతుకు పోరాటం చేస్తున్నారు గంగిరెద్దుల మహిళలు. ఊరిలో ఉపాధి కరువై బతుకు భారంగా మారి భర్తలు వలస బాట పట్టడంతో కుటుంబ భారం మహిళలపై పడింది. తెల్లవారక ముందే ఇంటి నుంచి బయలుదేరి చిన్నా చితక వస్తువులు అమ్ముతూ బతుకీడుస్తున్నారు. చిన్న పిల్లల ఆలనా, పాలన చూసే వారు లేక చంకన చంటి బిడ్డతో గంప నెత్తిన పెట్టుకొని ఊర్లు తిరుగుతారు. ఎవరైనా దయతలచి ముద్ద వేస్తే తిని పూట గడుపుకోవడం నిత్య కృత్యంగా మారింది. నంగునూరు మండలం ముండ్రాయిలో గంగిరెద్దుల మహిళలు పడుతున్న కష్టాలపై ప్రత్యేక కథనం..

సంచార జీవనంతో భర్తలు వలస

- 9 నెలలపాటు జిల్లాలు, రాష్ట్రాలకు పయనం
- ఆ ఇంటి మహిళపైనే కుటుంబ భారం
- గ్రామాల్లో తిరుగుతూ చిన్నాచితక వస్తువులు అమ్మకం
- ముండ్రాయిలో గంగిరెద్దుల మహిళల దీనస్థితి
- ఎస్టీలుగా గుర్తించాలని డిమాండ్

నంగునూరు(సిద్దిపేట): కుల వృత్తులు అంతరించిపోతున్నా తాము నమ్ముకున్న వృత్తినే జీవనాధారంగా చేసుకొని జీవిస్తున్నారు గంగిరెద్దుల వారు. వ్యవసాయ భూమి లేక గంగిరెద్దుల ఆటలకు ఆదరణ కరువై బతుకు భారంగా మారడంతో పురుషులు ఇతర జిల్లాలు, పక్క రాష్ట్రాలకు వలస వెళ్తున్నారు. అక్కడే గుడిసెలు వేసుకొని 9 నెలలపాటు ఉండి చుట్టు పక్కల గ్రామాలు తిరుగుతూ జీవనం సాగిస్తారు. వర్షాకాల ప్రారంభం కాగానే స్వస్థలాలకు చేరుకొని మూడు నెలలపాటు భార్య, పిల్లలతో గడిపి తిరిగి తాము నివసించే ప్రాంతాలకు వలస వెళ్తారు. గంగిరెద్దులను కొనేందుకు డబ్బులు లేక కొందరు కూలీలుగా మరి కొందరు సంక్రాంతి సీజన్‌లో ఎద్దులను అద్దెకు తీసుకొని ఇంటింటికీ తిరిగి ప్రజలు ఇచ్చే డబ్బులు, బట్టలను తీసుకొని దీవెనలు అందజేస్తారు. అలాగే ఇక్కడే జీవించే వృద్ధులు డప్పు వాయిస్తూ, సన్నాయిలు ఊదుకుంటూ గ్రామాలు తిరుగుతూ జీవనం సాగిస్తారు.

కడుపు నింపుతున్న చిరు వ్యాపారం

ముండ్రాయి గంగిరెద్దుల కాలనీలోని పురుషులు వలసపోవడంతో మహిళలు తెల్లవారు జామునే లేచి ఇంటి పని, వంట చేసి గాజుల తట్టనెత్తిన పెట్టుకొని ఊళ్లకు బయలుదేరుతారు. కాస్మోటిక్ వస్తువులు గాజులు, అద్దాలు, క్రీములు, దువ్వెనలు, చిన్న చిన్న డబ్బాలు అమ్ముకుంటూ మారుతున్న కాలానికి అనుగుణంగా బ్యాగులు, స్వెట్టర్లకు జిప్పులు వేస్తూ కుటుంబ భారం మోస్తున్నారు. ఎవరన్న దయతలిచి అన్నంపెడితే అక్కడే తింటామని లేకుంటే పస్తులు ఉంటామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


గంప నెత్తిన పెట్టుకొని ఇంటి నుంచి బయలుదేరుతున్న మహిళలు


గాజులు అమ్మడానికి వెళ్తున్న మహిళ


ఓ ఇంటి వద్ద అన్నం తింటున్న మహిళలు

కేసీఆర్ కృషితో ఇళ్ల నిర్మాణం

గంగిరెద్దుల వారి బాధలను చూసి చలించిన మాజీ సీఎం కేసీఆర్ 1988లో ముండ్రాయి, రాంనగర్, గట్టమల్యాలలో ఒక్కో గ్రామానికి 30 ఇళ్లను కట్టించి ప్రత్యేక కాలనీలను ఏర్పాటు చేశారు. కుటుంబాల సంఖ్య పెరిగినా కొత్తగా ఇళ్లు మంజూరు కాకపోవడంతో అదే కాలనీలో గుడిసెలు వేసుకొని కాలం వెళ్లదీస్తున్నారు.

తమ లాగా పిల్లలు కావొద్దని

పిల్లల ఉన్నత చదువుల కోసం అప్పులు చేసి డిగ్రీ, పీజీ, బీఈడీ, ఇంజనీరింగ్ చేయిస్తున్నారు. గంగిరెద్దుల వారు రిజర్వేషన్ కేటగిరి ఏలో ఉండడంతో మిగితా వారితో పోటీ పడలేకపోతున్నారు. అడుక్కొని బతుకీడుస్తున్న తమను ఎస్టీలుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

మారని బతుకులు



1995లో గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యా. పిల్లల పెళ్లి చేయడంతో అప్పులపాలై సంగారెడ్డి జిల్లా శివ్వంపేటకు వచ్చి గుడిసెలు వేసుకొని ఇక్కడే ఉంటున్నాం. నేను చిరు వ్యాపారం, మా భర్త గ్యాస్ పొయ్యిలు, కుక్కర్లు, మిక్సీలు రిపేర్ చేస్తూ బతుకీడుస్తున్నాం. గ్రామంలో పని లేక పస్తులుండే పరిస్థితి నెలకొనడంతో అందరూ వలస వెళ్తున్నారు.
– మెండె సారవ్వ, మాజీ సర్పంచ్, ముండ్రాయి

పిల్లలు ఏడిస్తే వెంట తీసుకుపోతున్నా



ప్రతీ రోజు ఆటోలో వెళ్లి గ్రామాల్లో తిరిగి గరం అంగీలు, బ్యాగులకు జిప్పులు, గాజులు, బొట్టుపిల్లలు అమ్మితే రెండు వందలు కూడా రావు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో చిన్న పిల్లలను ఎత్తుకొని వెళ్లాల్సి వస్తోంది. ఎవరైనా దయ తలచి బువ్వ పెడితే అక్కడే తింటాం లేకుంటే పస్తులు ఉంటాం.
– జిడ్డి స్వప్న, ముండ్రాయి

మహిళలకు ఆసరాగా నిలవాలి



స్థానికంగా పని లేక పురుషులు వలస వెళ్లడంతో కుటుంబ భారం మహిళలపై పడుతోంది. అణగారిన వర్గాలను అడుక్కుతినే తమను ఎస్టీలుగా గుర్తించి ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేయాలి. మహిళలకు రుణాలు ఇవ్వడంతోపాటు ఇళ్లు, పింఛన్లు ఇచ్చి ఆదుకోవాలి.
– మెండె మల్లేశం, గంగిరెద్దుల సంక్షేమ నాయకుడు

చెరువులో మునిగి ఐదేళ్ల బాలిక మృతి

తూప్రాన్ పట్టణ కేంద్రంలో ఘటన


బాలిక మృతదేహం

తూప్రాన్: చెరువులో బట్టలు ఉతికేందుకు తల్లిదండ్రులతో కలిసి వెళ్లిన బాలిక ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందింది. ఈ ఘటన తూప్రాన్ పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ యాదగిరి కథనం మేరకు.. పట్టణానికి చెందిన మహ్మద్ చంద్‌పాషా, భార్య పర్వీమాలకు ఇద్దరు సంతానం. కూతురు జుబెరియా(5)తో కలిసి చెరువులో బట్టలు ఉతికేందుకు వెళ్లారు. బట్టలు ఉతుకున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి జుబెరియా చెరువులో పడిపోయింది. వెంటనే బయటకు తీసి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. అప్పటి వరకు కళ్లెదుట ఆడుతూ గంతులేసిన కూతురు ఇక తిరిగి రాదని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి


లక్షయ్య(ఫైల్)

హవేళీఘణాపూర్(మెదక్): చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని రాజ్‌పేటలో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బత్తుల లక్ష్మయ్య(60) మంగళవారం రాత్రి గ్రామ శివారులో ఉన్న గంగమ్మవాగులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు వల చుట్టుకొని నీటిలో మునిగి మృతి చెందాడు. బుధవారం తెల్లవారుజామున వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గంగమ్మవాగు వద్దకు వెళ్లి చూడగా బట్టలు, చెప్పులు కనిపించాయి. స్థానికులతో కలిసి వెతికించగా మృతదేహం లభ్యమైంది. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. మృతుడి భార్య జయవ్వ ఆరు నెలల కిందట మృతి చెందగా, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బావిలో పడి రైతు..


లక్ష్మీనర్సయ్య(ఫైల్)

వర్గల్(గజ్వేల్): ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి చెందిన ఘటన వర్గల్ మండలం మీనాజీపేటలో చోటు చేసుకుంది. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. మీనాజీపేటకు చెందిన దుందిగల్ల లక్ష్మీ నర్సయ్య(61)కు భార్య దుర్గమ్మ, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కొద్దిపాటి వ్యవసాయ భూమిలో కూరగాయలు, తదితర పంటలు సాగు చేస్తాడు. బుధవారం ఇంటి పక్కన ఉన్న బావి పైపునకు మోర నర్సింలుతో కలిసి గేట్ వాల్వు బిగిస్తూ ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడిపోయాడు. నీటిలో మునిగిపోయి ఊపిరాడక మృతి చెందాడు. మృతుడి కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొమురయ్యను గెలిపించుకుందాం

బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిత్తరంజన్‌రెడ్డి


ఎన్నికల ప్రచారంలో చిత్తరంజన్ రెడ్డి, నాయకులు

తూప్రాన్: యువతకు ఉద్యోగ అవకాశాల కోసం బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్యను గెలిపించుకుందామని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, గజ్వేల్ అసెంబ్లీ ఇన్‌చార్జి చిత్తరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యారంగంలో మార్పు కోసం జరుగబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మల్కా కొమురయ్యకు కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ ఉపాధ్యాయులు, యువత మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ సభ్యులు బండారు దుర్గారావు యాదవ్, గజ్వేల్ అసెంబ్లీ ఇన్‌చార్జి సాయిబాబా, తూప్రాన్ మున్సిపల్ అధ్యక్షుడు భూమన్న గారి జానకీరామ్ గౌడ్, వెంకట్‌గౌడ్, నరేశ్ గౌడ్, నరేందర్‌చారి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై నిరంతర పోరాటం

సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

చేర్యాల(సిద్దిపేట): ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేది సీపీఎం పార్టీయేనని పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శెట్టిపల్లి సత్తిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మల్లారెడ్డి మాట్లాడుతూ పోరాడే గొంతుకలను స్థానిక ఎన్నికల్లో గెలిపించినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. సమావేశంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య

నిజాంపేట(మెదక్): కడుపునొప్పి భరించలేక ఉరేసుకొని మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన సంగోళ్ల వినోద(32), మల్లేశం కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మల్లేశంకు నోటి మాట సరిగారాదు. రెండు నెలల నుంచి వినోద కడుపునొప్పితో బాధపడుతోంది. మంగళవారం రాత్రి బాధ భరించలేక ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి అత్త రాజవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ముత్తంగిలో వృద్ధుడు..

పటాన్‌చెరు టౌన్: కడుపునొప్పి తాళలేక వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామానికి చెందిన కృష్ణ (68) కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. రెండు రోజులుగా కడుపు నొప్పి తీవ్రం కావడంతో స్థానికంగా ఉన్న మెడికల్ షాపులో మాత్రలు తెచ్చి వేసుకున్నాడు. అయినా తగ్గకపోవడంతో ఆవేదనకు గురై మంగళవారం రాత్రి ఇంటి పక్కన చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు సురేశ్ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అనారోగ్యంతో మహిళా కానిస్టేబుల్ మృతి


స్వప్న(ఫైల్)

చేర్యాల(సిద్దిపేట): అనారోగ్యంతో మహిళా కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన చేర్యాల మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మద్దూరు మండలం గాగిల్లాపూర్‌కి చెందిన స్వప్న (30) 2014లో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికైంది. పూర్వపు వరంగల్ జిల్లాలోని పలుస్టేషన్లలో పని చేసిన ఆమె 2021లో చేర్యాల పోలీస్‌స్టేషన్‌కి బదిలీపై వచ్చింది. 3నెలల కిందట స్వప్నకి బాబు పుట్టాడు. అప్పటి నుంచి అనారోగ్యానికి గురైన ఆమె బుధవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.

కారు ఢీకొని హమాలీ కార్మికుడు మృతి

దుబ్బాకటౌన్: రోడ్డు ప్రమాదంలో హమాలీ కార్మికుడు మృతి చెందిన ఘటన రాయపోల్ మండలం అంకిరెడ్డిపల్లి గ్రామ బస్టాండ్ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. రాయపోల్ పోలీసుల కథనం మేరకు.. రాయపోల్ మండలం వీరానగర్ గ్రామానికి చెందిన జాలిగామ ఐలయ్య(35) అంకిరెడ్డిపల్లి గ్రామంలోని ఓ షాపులో సిమెంట్ లారీ లోడ్ ఖాళీ చేయడానికి దినసరి కూలీగా వెళ్లాడు. పని ముగించుకొని నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో ఐలయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. కారును ఆపకుండా డ్రైవర్ వెళ్లిపోయాడు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు గజ్వేల్–చేగుంట రహదారిపై ధర్నా చేశారు. బాధితుల ఫిర్యాదు కేసు నమోదు చేసిన రాయపోల్ ఎస్సై రఘుపతి, తొగుట సీఐ షేక్ లతీఫ్ ప్రమాదానికి కారణమైన కారు యజమాని వివరాల కోసం విచారణ చేపట్టగా వర్గల్ మండలం నెంటూర్ గ్రామానికి చెందిన గౌరయ్యగారి ప్రకాశ్ గౌడ్ గా గుర్తించారు. వెంటనే అతడిపై కేసు నమోదు చేస్తామని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

గజ్వేల్‌రూరల్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. పిడిచెడ్ గ్రామానికి చెందిన శ్రీనివాసచారి(49) బైక్‌పై గజ్వేల్ నుంచి గ్రామానికి వెళ్తున్నాడు. ఇదే క్రమంలో ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనదారుడు శ్రీనివాసచారిని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది క్షతగాత్రుడిని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, వైద్యుల సూచన మేరకు బాధిత కుటుంబ సభ్యులు ఆర్‌వీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాసచారి బుధవారం మృతి చెందాడు.

ప్రేమించిన అమ్మాయి దక్కడం లేదని..

మనస్తాపంతో ఉరేసుకొని యువకుడు బలవన్మరణం


గడ్డం గణేశ్ (ఫైల్)

కొండపాక(గజ్వేల్): ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకోలేకపోతున్నానంటూ మనస్తాపంతో యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుకునూరుపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్ కథనం మేరకు.. కుకునూరుపల్లి మండలంలోని మేదినీపూర్ గ్రామానికి చెందిన గడ్డం కనకయ్య కుటుంబీకులు బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లారు. ఇక్కడ చదువుకునే సమయంలో గణేశ్ తనతో చదివే ఓ అమ్మాయిని ప్రేమించాడు. పెళ్లి చేసుకోవాలని అనుకున్నారు. కానీ గణేశ్ కుటుంబీకులు పెళ్లికి అంగీకరించకపోవడంతోపాటు మేన మరదలితో పెళ్లి చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి ఫోన్ మాట్లాడుతూ ఇంట్లోంచి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. బుధవారం తెల్లవారు జామున ఇంటి పరిసరాల్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

జీపీ సిబ్బందిపై దాడి ఘటనలో ఏసీపీ విచారణ


విచారణ చేస్తున్న గజ్వేల్ ఏసీపీ పురుశోత్తంరెడ్డి

కొండపాక(గజ్వేల్): గ్రామ పంచాయతీ ఎదుట ఉన్న ఫ్లెక్సీలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బందిపై జరిగిన దాడిపై బుధవారం గజ్వేల్ ఏసీపీ పురుశోత్తంరెడ్డి విచారణ చేపట్టారు. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు.. కొండపాక గ్రామ పంచాయతీ కార్యాలయానికి ఎదురుగా పలు రకాల ఫ్లెక్సీలను కట్టారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో పై అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం సిబ్బంది వివిధ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలను జీపీ సిబ్బంది తొలగిస్తున్నారు. దీంతో బీజేపీ పార్టీ కార్యకర్త చెన్న హరికిషన్, శ్రీరామ్, మధు ఎందుకు ఫ్లెక్సీలను తొలగిస్తున్నారంటూ సిబ్బందిని తిడుతూ దాడి చేశారు. గజ్జె నర్సింలు ఫిర్యాదు మేరకు ప్రాథమికంగా ఎస్సీ ఎస్టీ కేసును నమోదు చేశాం. ఈ విషయమై ఏసీపీ పురుశోత్తంరెడ్డి, తొగుట సీఐ లతీఫ్ ఘటనా ప్రదేశాన్ని పరిశీలించి గ్రామ పంచాయతీ కార్యాలయంలో బాధితుడి, సాక్షులను విచారించి స్టేట్ మెంట్‌లను రికార్డు చేశారన్నారు. ఈ సందర్భంగా పురుశోత్తంరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించడం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని గుర్తించకుండా గొడవలు చేసే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంక్వైరీ రిపోర్టులు పై అధికారులకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్, పోలీసులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

మారిన శైలి.. వ్యాధుల కొలిమి

- తగ్గిన శారీరక శ్రమ, మారిన ఆహారపు అలవాట్లు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- జిల్లాలో 7,66,153 జనాభా
- 40 వేల పైచిలుకు బీపీ, 27,167 మంది షుగర్ వ్యాధిగ్రస్థులు
- 310 క్యాన్సర్ పేషెంట్లు
- ఆరోగ్యంపై శ్రద్ధ తప్పనిసరి అంటున్న వైద్యులు

మెదక్‌జోన్: మారిన ఆహారపు అలవాట్లు, శారీక శ్రమ లేకపోవడంతో వంటి కారణాలతో మూడు పదుల వయస్సు దాటకుండానే బీపీ, షుగర్, క్యాన్సర్‌లాంటి వ్యాధుల బారిన పడి ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారు. ఉరుకుల పరుగుల జీవనశైలిలో ఉదయం లేచిన మొదలుకొని రాత్రి పడుకునే వరకు ఏసీ గదులకే పరిమితమై కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లతో పని చేయటం, ఉద్యోగం, ఆర్థికపరంగా టెన్షన్‌లకు గురి కావడంతో షుగర్ లాంటి వ్యాధులు సోకుతున్నాయి. మద్యం సేవించటం, సిగరేట్, బీడీ, చుట్టలాంటివి తాగడంతో బీపీ, క్యాన్సర్‌లాంటి దీర్ఘకాలిక ప్రమాదకర వ్యాధులు సోకుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. వాటికి తోడు ప్రమాదకర రసాయన ఎరువులు, ఫెస్టిసైడ్ మందులతో పండించిన పంటలను తినడం ప్రమాదకరమైన వ్యాధులు సోకటానికి మరో కారణమని వైద్యులు చెబుతున్నారు.



మెదక్ జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం 7,66,153 మంది జనాభా ఉన్నారు. వీరిలో దీర్ఘకాలిక వ్యాధులతో 68,036 మంది బాధపడుతున్నారు. ఇందులో 40,529 మంది బీపీ, 27,167 మంది షుగర్ వ్యాధిగ్రస్థులు ఉన్నారు. 310 మంది క్యాన్సర్ పేషెంట్లు ఉన్నట్లు వైద్యారోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. వీరిలో 30 ఏళ్లపైబడిన వారే 60 శాతానికి పైగా ఉండటం ఆందోళన కలిగిస్తుంది. ఒకప్పుడు 60 ఏళ్లు దాటాక గుండె పోటు, షుగర్ వ్యాధులు వచ్చేవి. కానీ నేడు 30 ఏళ్లు దాటకుండానే రోగాలు పట్టి పీడిస్తున్నాయి.

శారీరక శ్రమ లేకపోవడమే!

బీపీ, షుగర్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులు దరి చేరకుండా ఉండాలంటే ప్రతీ వ్యక్తి శారీరక శ్రమ అలవర్చుకోవాలి. నీడ పట్టున కూర్చొని విధులు నిర్వహించే ఉద్యోగులు ప్రతిరోజూ నడకతోపాటు గంట సేపు గ్రౌండ్‌కు వెళ్లి వ్యాయామం, యోగా, ప్రాణాయమం లాంటి ఆసనాలు వేయాలి. అలాగే మంచి ఆహారాన్ని తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రస్తుతం పంటల దిగుబడి పెంచేందుకు విచ్చలవిడిగా రసాయన ఎరువుల వాడుతున్నారు. తెగుళ్ల బారిన పడిన పంటలపై మోతాదుకు మించి ఫెస్టిసైడ్ మందులను వాడటంతో అవి విషతుల్యమవుతున్నాయి. వాటిని ఆహారంగా తీసుకోవడంతో క్యాన్సర్‌తోపాటు బీపీ, షుగర్‌లాంటి వ్యాధులు సోకుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

వ్యాయామం అలవర్చుకోవాలి



ఉరుకుల పరుగుల జీవితంలో ప్రజలు వ్యాయామం చేయడం మర్చిపోతున్నారు. ఫలితంగా వ్యాధులు అధికంగా సోకుతున్నాయి. ప్రతిరోజూ ఉదయం, లేదా సాయంత్రం వేళలో కనీసం గంటపాటు వివిధ రకాల వ్యాయమాలతోపాటు నడక, యోగాలాంటివి అలవాటు చేసుకోవాలి. ఆహారం సైతం సేంద్రియ ఎరువులతో పండించినవే తీసుకోవాలి.
– శ్రీరామ్, డీఎంహెచ్‌ఓ, మెదక్